నేటి నుంచి పూడిమడక తీరంలో బీచ్ హ్యాండ్ బాల్ పోటీలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: పూడిమడక తీరంలో అంతర్ జిల్లా పురుషుల బీచ్ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విశాఖ ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు , ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్యుతాపురం మండలంలో గల పూడిమడక బీచ్‌లో ఈనెల 4, 5 తేదీలలో జరిగే ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయన్నారు. 13 జిల్లాలలో గల మంచి క్రీడాకారులను ఎంపిక చేసి ఒక టీంగా తయారుచేసి ఆంధ్రప్రదేశ్ తరపున ఉత్తరాఖాండ్‌లో జరగబోవు 38వ నేషనల్ గేమ్స్‌లో పాల్గొంటారన్నారు. తన వ్యక్తిగత ఆర్థిక సహాయంతో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ టోర్నమెంట్లో పాల్గొన్న క్రీడాకారులకు మొదటి, ద్వితీయ, తృతీయ, ఉత్తమ ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు బహుమతులు అందజేస్తామన్నారు.

తహశీల్దార్ దురుసు ప్రవర్తన

నల్ల బ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగులు నిరసన

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కే.విజయ రాజుపై మండల తహశీల్దార్ సత్యనారాయణ దురుసుగా ప్రవర్తించారంటూ మండలంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, ఎంపీడీవో జయ ప్రకాశరావుకు వినతి పత్రం చేశారు. వినతిపత్రాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయరాజు మాట్లాడుతూ ఐవిఆర్ఎస్ కాల్స్ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సత్యవరం గ్రామంలో ఎంపీడీవో జయప్రకాశరావు, తహసిల్దార్ సత్యనారాయణ, ఈవోపీఆర్డి చంద్రశేఖర రావు విచారణ నిర్వహించినట్లు తెలిపారు. విచారణ నిర్వహిస్తూ వీడియో తీస్తుండగా వీడియో ఫ్రేమ్ లోంచి పక్కకు జరిగినందుకు తహశీల్దార్ దురుసుగా ప్రవర్తించి తన చెయ్యి పట్టుకుని వీడియో ఫ్రేమ్‌లోకి లాక్కు వచ్చారని ఆవేదన చేశారు. పింఛన్‌దారులు, అధికారులు, తోటి సచివాలయ ఉద్యోగుల మధ్యలో తనపై దురుసుగా ప్రవర్తించడం పట్ల తన మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు అంటే అధికారులు చులకనగా చూస్తున్నారని వాపోయారు. తనకు జరిగిన అవమానం మరే ఇతర సచివాలయ ఉద్యోగస్తులకు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజయ్ రాజు కోరారు. ఈ విషయమై ఎంపీడీవో జయప్రకాశ్ రావు ఇటువంటి సంఘటనలు మరోసారి జరగకుండా చూస్తామని తెలిపారు. తహశీల్దార్ సత్యనారాయణను ప్రశ్నించగా తాను వేరే ఉద్దేశంతో కావాలని చేయలేదని, విజయరాజు పెన్షన్లు పంపిణీ చేసిన పింఛన్‌దారుల వద్ద విచారణ చేస్తుండగా వీడియో ఫ్రేమ్ లోంచి పక్కకెళ్ళడంతో చెయ్యి పట్టుకొని ఫ్రేమ్‌లోకి తెచ్చానని తెలిపారు.

మహాత్ములను ఆదర్శంగా తీసుకోవాలి

సీపీఐ జిల్లా సమితి సభ్యులు రాధాకృష్ణ

విశాలాంధ్ర - గొలుగొండ: కుల మతాల చిచ్చులు పక్కనపెట్టి బాబా సాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేను ప్రతి ఒక్కరు ఆదర్శం తీసుకోవాలని సీపీఐ అనకాపల్లి జిల్లా సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం పప్పుశెట్టిపాలెం అంగన్వాడి కేంద్రంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రాధాకృష్ణ కుమార్తె అభిజ్ఞ శ్రీ పుట్టినరోజు వేడుకలను చిన్నారుల మధ్య సావిత్రిబాయి పూలే జయంతి రోజున నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంఘసంస్కర్త ఉపాధ్యాయిని రచయిత్రి నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన జ్యోతిరావు పూలే భార్య కులమత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన గ్రామ స్వరూపిని అని కొనియాడారు. ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు పీడిత ప్రజల ముఖ్యంగా స్త్రీల విద్యకు కృషి చేసిన తొలి తరం మహిళ ఉద్యమకారిణి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది శ్యామ్, కుమారి, జ్యోతి, రామలక్ష్మి, భారతి, సిహెచ్ చిన్నారి, వార్డు మెంబర్ కుంచాలక్ష్మి చిన్నారులు పాల్గొన్నారు.

పశు విజ్ఞాన బడితో రైతులకు ఉపయోగం

విశాలాంధ్ర - సబ్బవరం: పశు విజ్ఞాన బడి ద్వారా పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ఉపయోగాలు తెలియజేయాలని విశాఖపట్నం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా. ఎం. చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని స్థానిక మండల పశువైద్యశాలలో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు గోకులం షెడ్డుల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకం ద్వారా పశు గ్రాసం పెంపకం, పశు కిసాన్ క్రెడిట్ కార్డ్స్ గురించి సమీక్ష నిర్వహించారు. అనంతరం గత ఏడాది అక్టోబర్ 25 నుండి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతున్న అఖిల భారత పశు గణన కార్యక్రమాన్ని సబ్బవరం పంచాయితీలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశు సంవర్ధక శాఖ ఏ.డి డా. కె. ఉషాకుమారి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షులుగా బద్ధపు శివ ఎన్నిక

విశాలాంధ్ర - యలమంచిలి: బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా స్థానిక బిజెపి కార్యాలయంలో పట్టణ మండల అధ్యక్షులు ఎన్నిక కోసం సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి మండల ఎన్నికల అధికారి ఊడ రమేష్ హాజరయ్యారు. అనంతరం బిజెపి పట్టణ అధ్యక్షుడిగా బద్ధపు శివను ఎన్నుకోవడం జరిగిందని ఊడ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా బద్ధపు శివ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి పార్టీ పటిష్ఠత కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ గుర్రాల నరేష్, యలమంచిలి కో కన్వీనర్ నక్కా శివ శంకర్, ఓబిసి జనరల్ సెక్రటరీ పెట్ల దాసుబాబు, మాజీ పట్టణ అధ్యక్షులు రాజన్న సత్యనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ బివిఎస్ వర్మ, పప్పు ఈశ్వరరావు, చెక్క శ్యామ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

విశాలాంధ్ర - అనకాపల్లి: దేశంలో మహిళా అభ్యున్నతి కోసం, స్త్రీ విద్య కోసం పరితపించిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని యువ న్యాయవాది చిట్టా జయ శ్రీ అన్నారు. శుక్రవారం ఉదయం సావిత్రిబాయి పూలే 134వ జయంతి కార్యక్రమం అనకాపల్లి గాంధీనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా జయ శ్రీ మాట్లాడుతూ దేశంలో అనేకమంది

మహిళలు అత్యున్నత శిఖరాలను అధిరోహించు టకు సావిత్రిబాయి పూలే చేసిన పునాదులే కారణం అని అన్నారు. నాటి సమాజంలో స్త్రీలు చదువుకు దూరంగా ఉండే సాంప్రదాయం ఉండేదని అటువంటి పరిస్థితుల్లో స్త్రీలకు చదువు నేర్పించుటకు ప్రత్యేకమైన పాఠశాలలు ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత విద్యను అందించారని ఆమె అన్నారు. నేటి మహిళా లోకం అభివృద్ధికి సావిత్రిబాయి పూలే వేసిన పునాదులే కారణమని అన్నారు. ఈ సందర్భంగా మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు కొనియాడారు. సావిత్రి బాయి పూలే ఆశయ సాధన కోసం ప్రతి మహిళ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఎలుగుబంటి సుధా, న్యాయవాదులు ఐ.ఆర్.గంగాధర్, అవినాష్ ఇళ్ల, ఓడిబోయిన రాంబాబు, బీసీ సంఘ నాయకులు పోలవరపు ఆనంద్, లాలం ప్రసాద్, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

రాంబిల్లి: మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వం కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతిని మండలంలో పంచదార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మాట్లాడుతూ భారత సమాజంలో చారిత్రాత్మకమైన మార్పుకు సావిత్రిబాయి పూలే పునాది వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ సి. హెచ్. మంగతాయారు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలపై స్పీకర్ సమీక్ష

విశాలాంధ్ర - నర్సీపట్నం: వెలుగు డిపార్ట్మెంట్, బ్యాంకర్స్‌తో స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వాక్రా గ్రూపులు సభ్యులు తీసుకుంటున్న రుణాలు వారికి ఎంతవరకు ఉపయోగకరంగా ఉంటున్నాయో వారిని ప్రశ్నించారు. మహిళలను ఆర్థికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నియోజవర్గంలోని మండలాల్లో ఎన్ని గ్రూపులు ఉన్నాయో, వారు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నారా అని బ్యాంకర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రూప్ సభ్యులు తీసుకున్న రుణాలు వారికి ఆదాయం వచ్చేలా చిన్న తరహా పరిశ్రమలు పెట్టడానికి ప్రోత్సహించాలని అన్నారు. సభ్యులకు సబ్బులు, షాంపులు, క్యాండిల్స్, పసుపు పొడి వంటి వివిధ ఉత్పత్తుల తయారీపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ పరిశ్రమలలో తయారుచేసిన వస్తువులను బ్రాండింగ్ చేసి, ఆన్లైన్ ద్వారా మరియు సూపర్ మార్కెట్లలో అమ్మే విధంగా ప్రోత్సాహం అందించాలని అన్నారు. వెలుగు డిపార్ట్మెంట్ బ్యాంకర్ల సమన్వయంతో డ్వాక్రా గ్రూప్ సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్, ఏపిఎంలు, నాలుగు మండలాల ఎస్‌బిఐ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

విశాలాంధ్ర - పరవాడ: విద్యుత్ ప్రైవేటీకరణ వెంటనే నిలిపి వేయాలని ఎన్టీపీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేసారు. చండీగర్ ప్రజలకు సంఘీభావంగా శుక్రవారం సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్ గేట్ వద్ద ఎన్టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సంధర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ దేశంలో అన్ని పరిశ్రమలను, ప్రభుత్వ రంగాలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు పరం చేసి కార్పొరేట్ యజమానులకు కారు చౌకగా అప్పజెప్పాలని చూడటం దుర్మార్గం అన్నారు. చండీఘర్ విద్యుత్ ప్రైవేటీకరణ ఆలోచనను వెంటనే ఉప సంహరించాలని ఆయన డిమాండ్ చేసారు. గత నాలుగేళ్లుగా చండీఘర్‌లో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన జరుగుతోందన్నారు. లాబాల బాటలో నడుస్తున్న డిస్కమ్‌ను ప్రవేటీకరించేందుకు బీజేపీ కంకణం కుట్టుకుందని విమర్శించారు. దేశంలో అత్యంత చౌకగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఈ సంస్థను ప్రైవేటీపరం చేసి మోడీ ప్రభుత్వం కార్పొరేట్ యజమానులకు ఊడిగం చేస్తుందని గనిశెట్టి మండి పడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని ఈ సంధర్భంగా గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పిపి నాయుడు, పి.గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పథకాన్ని తక్షణం అమలు చేయాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గల నెహ్రూ చౌక్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి బాబ్జి, జి. ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలనే ఆలోచన సరికాదని ఇప్ప టికే ఎంతోమంది పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, గత వైసిపి ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తుందని ఎన్నికల ప్రచారంలో ఎంతో బహటంగా ప్రచారం చేసి ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంతమందికి 15 వేల రూపాయలు కూటమి ప్రభుత్వం వస్తే ఇస్తామని ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి విద్యార్థులకు అన్యాయం చేయడం సరి కాదని అన్నారు.

ఇప్పటికైనా వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం అమలు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఈ విద్యా సంవత్సరం నుంచే తల్లికి వం దనం పథకాన్ని అమలు చేయాలని అదేవిధంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులను ఐక్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, దివ్య,భవాని పాల్గొన్నారు.

'పది'లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ విజయ్ కృష్ణన్

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్: జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో విద్యాశాఖ కు సంబందించి జిల్లా స్థాయి, డివిజన్, మండలం స్థాయి అధికారులతో పదవ తరగతి పరీక్షల్లో శతశాతం లక్ష్యంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పరచడం, నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యాలను సాధించడంపై చక్కటి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకి బోధన విషయంలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులు, అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఆయా మండల విద్యా శాఖ అధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పర్యవేక్షణ హాజరు పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు సమయానికి 5 నిమిషాలు ముందు గానే వుండాలన్నారు. స్టూడెంట్స్ ఆధార్ అప్డేషన్, పాఠశాలల పర్యవేక్షణ, టీచర్స్, స్టూడెంట్స్ హాజరు, ఎఫ్ 1, ఎఫ్ 2, మార్క్ అప్డేషన్, మధ్యాహ్నం భోజనం పథకం వంటి అంశాల పై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. గత ఆగష్టు నెల నుంచి ఇప్పటి వరకు పారా మీటర్ల వారి ప్రగతి నివేదికలు సమర్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో శుభ్రతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి జి.అప్పారావు నాయుడు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

5న ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల సదస్సు

విశాలాంధ్ర - మునగపాక: జనవరి 5న ఆటో, మోటార్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జరుగు సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గోడ పత్రికను మునగపాకలో సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టం వలన రానున్న రోజుల్లో డ్రైవర్ల వృత్తి ప్రమాదంలో పడిపోయిందని, ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం వలన మోటార్ కార్మికులు శిక్షలు కఠిన తరం చేశారని ప్రమాదాలు జరగడానికి సరైన రోడ్లు లేకపోవడం, పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్లు వెడల్పు లేకపోవడం, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన లేక జరుగుతున్నాయని, ప్రమాదాలకు డ్రైవర్ని కారణం చేస్తూ తెచ్చిన చట్టం దుర్మార్గమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక, వాడ్రాపల్లి ఆటో యూనియన్ నాయకులు ఇంటి శ్రీనివాసరావు, అప్పలనాయుడు, ఎన్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పశుగణన త్వరితగతిన చేపట్టాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: గ్రామాల్లో పశు గణన కార్యక్రమాన్ని త్వరితగతన చేపట్టాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ పశు వైద్య సహాయకులను ఆదేశించారు. శుక్రవారం కే.సౌంతపాలెంలో రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన గోకులం షెడ్లను పూర్తిచేయాలని పశు గ్రాస పెంపకాన్ని రైతులు వినియోగించేలా అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో చౌడువాడ పశువైద్యులు డాక్టర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా బాండ్లు పంపిణీ

విశాలాంధ్ర - మాకవరపాలెం: జర్నలిస్టులకు ప్రమాద బీమా బాండ్లను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పంపిణీ చేశారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యూనియాన్ సభ్యులైన 70 మందికి యూనియన్ ఆధ్వర్యంలో రూ. 10 లక్షల ప్రమాద బీమా చెల్లించారు. ఈ నేపథ్యంలో ఈ బీమా బాండ్లను శుక్రవారం స్పీకర్ అయ్యన్న నివాసంలో జర్నలిస్టులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాప్ రాష్ట్ర కార్యదర్శి వై.వేణు, కార్యవర్గ సభ్యులు కె.రామకృష్ణ, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గొర్లి రాజు, కార్యదర్శి రుత్తల శ్రీను, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు జెట్టి శంకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాడుగుల మీదుగా బస్సులు నడపాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల గ్రామ ప్రజలు బస్సు సౌకర్యం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ మాడుగులకు చెందిన కొట్యాడ రమేష్, ఢిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వరరావు శుక్రవారం అరకులో విజయనగరం జోనల్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ సివేరి దొన్ను దొరకు వినతి పత్రం అందించారు. విశాఖపట్నం నుండి పాడేరుకు వెళ్లే ప్రతీ బస్సు మాడుగుల మీదుగా వెళ్లాలని, అలాగే పాడేరు నుండి వచ్చే ప్రతి బస్సు మాడుగుల మీదుగా వెళ్లాలని వారు ఈ సమస్యను చైర్మన్ దృష్టికి తీసుకుని వెళ్లారు. అంతేకాకుండా మాడుగుల చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, అలాగే విద్యార్థులు కూడా పాఠశాలలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని 67, 68 బూతుల్లో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్డి వెంకటరమణ (పండు) ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వం ఉన్నవారికి బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంపల చినరాజు, బంగారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

విశాలాంధ్ర - రాంబిల్లి: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి, పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గురువారం రాత్రి రాంబిల్లి మండలం గోవిందపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి 7 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.49,250/-ల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు రాంబిల్లి ఎస్సై నాగేంద్ర తెలిపారు.

మరింత మెరుగ్గా అత్యవసర వైద్య సేవలు

విశాలాంధ్ర - చోడవరం: ఆపద, అత్యవసర సమయాల్లో ప్రజలందరినీ ఆదుకునే సంజీవని 108 వాహన సేవల్ని మరింత మెరుగు పరిచేందుకు వీలుగా ప్రభుత్వానికి నివేదిస్తామని ఆ విభాగం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ ఎం.మురుగన్ బృందం స్పష్టం చేసింది. మురుగన్ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో అనకాపల్లి, చోడవరంలో పలు ప్రాంతాల్లోని 108,104 వాహనాల పని తీరుపై ఆకస్మిక తనిఖీలు జరిపారు. ప్రభుత్వం తరపున నగరానికి విచ్చేసిన మురుగన్ బృందం స్టేట్ నోడల్ అధికారి హోదాలో పలు కీలక అంశాలపై చర్చించింది. క్షతగాత్రుల్ని ఆదుకునేందుకు అహర్నిశలూ ప్రయత్నిస్తామని, వైద్య సేవలు మరింత మెరుగ్గా అందజేయగలమని స్పష్టం చేసింది. మురుగన్ వెంట అనకాపల్లి జిల్లా 108 విభాగ మేనేజర్ వి.వి త్రినాథరావు (రవి), జిల్లా 104 డి.ఎం అచ్యుతరావు, ఓ.ఈ.ఎస్, సిబ్బంది తదితరులున్నారు.

కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాలు

విశాలాంధ్ర - కశింకోట: మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాలలో భాగంగా రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆరవ రోజు కశింకోట గ్రామంలో సత్యసాయి ఆశ్రమానికి వంట సామాగ్రిని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, పెంటకోట రాము, వేగి గోపికృష్ణ, మాజీ డిసిసిబి డైరెక్టర్ సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి ఆశ్రమానికి వంట సామాన్లు, కుర్చీలకు డబ్బులు ఇచ్చినందుకు అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ హాస్పటల్ కమిటీ డైరెక్టర్ ఉల్లింగల రమేష్, మండల టీడీపీ ఉపాధ్యక్షులు కలగా సోమేశ్వరరావు, నయినంశెట్టి రమణారావు, కాండ్రేగుల సతీష్, దాడి నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాకాసి కృష్ణ, కర్రీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బుద్ధిరెడ్డి గంగయ్య, కర్రి దుర్గనాయుడు, మజ్జి ప్రకాష్, సిద్ధిరెడ్డి సూర్యనారాయణ, ఈశ్వరరావు, మండల టీడీపీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల నూకునాయుడు, గొంతిన గంగాధర్, కర్రీ గోవింద, బలిజి మునిలి నాయుడు, గొంతిని ఈశ్వరరావు, ద్వారపూడి సత్తిబాబు, కూటమి నాయకులు మహిళలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం సకాలంలో అన్ని పథకాలు వర్తింపు చేయాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్మిక శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు జారీ చేసిన గుర్తింపు కార్డులు అధ్యక్షులు కొల్నాటి తాతాజీ కార్యదర్శి అల్లాడ కొండబాబు సమక్షంలో పంపిణీ కార్యక్రమం నూకాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు ప్రతి ఒక్కరు రెన్యూవల్ చేయించుకోవాలని అలాగే కార్డులు లేనివారు నూతనంగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు ఎలాంటి ప్రమాదం సంభవించినా కార్మికులకు పది లక్షల రూపాయలు బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీవధార్ టీ షర్ట్ లాంచింగ్

సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

విశాలాంధ్ర-చోడవరం: జనవరి 3, ఈ నెల ఐదున సి.డి.వి.ఎం కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జీవధార్ రక్తదాన శిబిరం సద్భావ టీం 'టీ షర్ట్ 'లను సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి శుక్రవారం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ గీతా లక్ష్మీ మాట్లాడుతూ 'రక్తదానం మరొకరికి ప్రాణదానమని' రక్త దానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు, కక్షిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సి.డి.వి.ఎం కమ్యూనిటీ అడ్మిన్ కొప్పాక రాజేష్, స్వయంభు గణపతి దేవస్థానం ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు, ఉప్పల రజని, పి.మల్లిక్, పసుమర్తి శ్రీనివాసరావు (బ్రూక్ బాండ్ శ్రీను), డాక్యుమెంట్ రైటర్లు, సద్భావ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శం సావిత్రిబాయి పూలే

విశాలాంధ్ర-నర్సీపట్నం : జాతీయ ఉపాధ్యాయిని శ్రీ సావిత్రి బాయ్ పూలే జయంతి సందర్భంగా ఈరోజు నర్సీపట్నం మున్సిపాలిటీ 11వ వార్డు లో గల జడ్పీహెచ్ స్కూల్ ఆవరణలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులందరికీ 11వ వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం మరియు బేతిరెడ్డి విజయకుమార్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం మాట్లాడుతూ దేవుని తర్వాత స్థానంలో గురువుని స్థానం ఉంటుందని వారి ద్వారానే విద్యావంతుని కానీయండి సంఘసంస్కర్తలు కానీయండి రాజకీయ నాయకులను కానీయండి తయారు చేయగల శక్తివంత గల వ్యక్తి ఒక గురువని ఆమె తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీబాయి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సమాజానికి ఎంతగానో ఆదర్శంగా నిలిచారని ఆవిడ చేసిన సేవలు ద్వారా ఆమెకి ఈ పురస్కారం దక్కిందని ఆమె తెలియజేశారు ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు మరియు పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

విశాలాంధ్ర-చోడవరం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 149వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ గర్ల్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాటి తొలి తెలుగు మహిళ ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ అణగారిన వర్గాలు, మహిళల కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటాలు సుదీర్ఘమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రమణ, అమ్మాజీ, విద్యార్థినిలు మధ్యాహ్న భోజన పథకం, శానిటేషన్ మహిళా కార్మికులు బుచ్చిరాజమ్మ, దేవి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని విశాఖ పర్యటనపై విస్తృతఏర్పాట్లు

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్: ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడి విశాఖపట్నం పర్యటన విజయవంతానికి విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన వీడియో సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్ లు, పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేశామని అందుకనుగుణంగా ఆయా శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం లేని రీతిలో కట్టుదిట్టమైన పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి ఇంకా మినిట్ టు మినిట్ కార్యక్రమం ఖరారై రావాల్సి ఉందని ఈలోగా వివిధ శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి పర్యటనకు విశాఖపట్నం సహా అనకాపల్లి,

విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల నుండి ప్రజలను బస్సులు,ఇతర వాహనాల్లో తరలించనున్నందున వారిని సురక్షితంగా తీసుకువచ్చి తిరిగి వారి గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లాల కలక్టర్లను ఆదేశించారు. సమావేశానికి వచ్చే వారికి తాగునీరు, భోజన వసతి వంటి ఏర్పాట్లలో ఎటువంటి విమర్శలకు తావీయకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వాహనాల ట్రాఫిక్, పార్కింగ్ వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఈసమావేశంలో జిఏడి ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి అనకాపల్లి జిల్లా కలక్టర్, జిల్లా ఎస్పీ సహా వివిధ శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు .సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఇందుకు సంబంధించి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. జిల్లా కలక్టర్ విజయ కృష్ణన్ ఏర్పాట్లు గురించి తెలియజేస్తూ విశాఖపట్నం బహిరంగ సభకు జిల్లా నుండి 40వేల మంది హాజరగుచున్నారని, వారికి 800 బస్సులను, భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్.టి.పి.పి. అచ్చుతాపురం మరియు నక్కపల్లిలో శంఖుస్థాపన వేదికల వద్ద వర్చువల్ గా శంఖుస్థాపన చేయుటకు, ప్రధానమంత్రితో ముఖాముఖి మాట్లాడుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం కార్యక్రమం సమన్వయం చేసుకొనుటకు కలెక్టరు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్. జాహ్నవి, రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్, జిల్లా పంచాయితీ అధికారి ఆర్ శిరీష రాణి, జిల్లా అదనపు ఎస్ పీ ఎమ్. దేవా ప్రసాద్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు : తాసిల్దార్ చిన్నకృష్ణ

విశాలాంధ్ర-సబ్బవరం: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ బి. చిన్నికృష్ణ చెప్పారు. మండలంలోని అనకపల్లి, ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన అన్ని సమస్యలు నిర్దేశించిన సమయంలో పరిష్కరిస్తామని చెప్పారు. అసకపల్లి గ్రామంలో 2900 ఎల్ పిఎం లు ఉండగా 1116.22 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో ప్రభుత్వ భూమి457. 97ఎకరాలు, జిరా యితీ 658.25 ఎకరాలు ఉంద న్నారు. ఎరుకు నాయుడు పాలెంలో 1868 ఎల్ పి ఎం లు ఉండగా 914. 83 ఎకరాల భూమి ఉంద న్నా ర ు ఇందులో ప్రభుత్వ బ ం జ ా ర ు 412.22ఎకరాలు జ రా ంయ తి 502. 61 ఎ క ా ర ాల ు ఉందన్నారు. ఈ సదస్సులో రైతుల నుంచి అసకపల్లి 12 అర్జీలు, ఎరుకు నాయుడుపాలెం 12 అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రీ నరసింగరావు, మాజీ సర్పంచ్ కరణం రామునాయుడు, ఎంపీటీసీ కర్రీ అప్పారావు, పాల సొసైటీ అధ్యక్షుడు రాపర్తి సన్నిబాబు, కూటమి నేతలు గవర అప్పారావు, గవర సత్యనారాయణ , రాపర్తి బాబురావు ,సర్వేయర్, రీ సర్వే డీటీ గణపతిరావు, సర్వేయర్ ఎల్. అప్పారావు, వీఆర్వో ఈశ్వరరావు, విలేజ్ సర్వేర్ మోహన్, రెవిన్యూ సిబ్బంది రైతులు తదితరులు

రాష్ట్రస్థాయి స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ప్రతిభ విద్యాలయం విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని స్థానిక ప్రతిభ విద్యాలయానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ2వ ఓపెన్ ఒలింపిక్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ డిసెంబర్ 15 తేదీన వైఫై స్పోర్ట్స్ పార్కులో జరిగాయని తెలిపారు. ఈ పోటీలలో తమ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు పాల్గొనగా 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్లో లో విద్యార్థులు 200 మీ, 400 మీ, 1000 మీటర్లలో పాల్గొని స్వర్ణ ,రజిత, కాంస్య పథకాలను సాధించారని తెలిపారు. ఈ పథకాల సాధించిన వారిలో ఎం. తిలక్ - 2 రజత పతకాలు, అంకుశ్ కుమార్ - 2 రజత, 1 కాంస్య పతకం, ఎం. జానప్రియ - 1 రజత పతకం,చి. సహస్ర - 1 స్వర్ణ, 1 కాంస్య పతకం,ఎస్. కౌశల్ 1 రజత పతకం,చి. జశ్విత - 3 రజత, 1 కాంస్య పతకం,ఎం. రామ వర్షిత్ - 1 కాంస్య పతకం,వి. మీనా వర్ధన్ - 1 రజత పతకం,ఎం. లిషి చరణ్- 3 రజత పతకాలు (1000 మీటర్లు %డ% రిలే) లో సాధించినట్లు తెలిపారు.అలాగే 2వ ఆంధ్ర ప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ 2024-2025 డిసెంబర్ 28న శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగాయి.చి. జస్విత జాతీయ స్థాయికి ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ పోటీలు అస్సాంలో జనవరి 18-21, తేదీలలో జరుగునున్నయని తెలిపారు.

పెట్రేగి పోతున్న మట్టి మాఫియా....పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-గొలుగొండ: గొలుగొండ మండలంలో మట్టి మాఫియా దౌర్జన్యాల రోజు రోజుకి అధికమవుతున్నాయి స్థానిక అధికారుల మాటలను పెడచెవిని పెడుతూ వారికి అడ్డొచ్చిన వారిపై తిరుగుబాటు చేస్తున్నారు. గొలుగొండ మండలం జోగంపేటలో అక్రమంగా రెవెన్యూ భూమిని తవ్వేస్తూ కొండకు కన్నం పెడుతున్నప్పటికీ పరిశీలించడానికి వెళ్లిన విలేకరుల పైన దౌర్జన్యం చేస్తున్నారు. అయితే ఈ తవ్వక దారులు వెనక రాజకీయ పార్టీలు అండదండలు కూడా పుష్కలంగా ఉన్నాయి అనే విషయం బయట ప్రచారం జోరుగా సాగుతుంది.జెసిబి యజమాని వైసీపీ పార్టీకి చెందినవారు. అయితే తన వ్యాపార లావాదేవీల కోసం అధికార పార్టీకి ముడుపులు చెల్లించుకుంటున్నారనే వాదన కూడా వినపడుతుంది దీంతో స్థానికులు కొంతమంది అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికార పార్టీ అగ్ర నాయకులు రెవెన్యూ అధికారులు తీసుకువచ్చి కాల్ జరుపుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రకృతి వనరులు దుర్వినియోగం కాకుండా కాపాడి భావితరాలకు అందించాలని పలువురు కోరుతున్నారు

కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన డాక్టర్ హను తేజ్

విశాలాంధ్ర-నర్సీపట్నం: నెహ్రు యువ కేంద్రమ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం తురక బడి స్కూల్ లోని క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ లొ భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. అందులో బాలికల ప్రథమ బహుమతి తురకబడి కబాడీ క్రీడాకారులు ద్వితీయ బహుమతి పెదబొడ్డేపల్లి క్రీడాకారులు గెలుపొందారు. వీటిని స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ ప్రముఖ వ్యాపార వేత్త వెలగా నారాయణ రావు, ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు ఎ.హనుతేజ గెలుపొందిన క్రీడాకారులికి మెడల్స్ ట్రోఫీ లు బహుకరించారు ఇందులో హెడ్ మాస్టర్ కే వి రమణ తురకబడి పీడీ లుగా లక్ష్మి, ప్రియాంక అర్ . రమణ పాల్గొన్నారు. తదుపరి 5న ఆదివారం 15 సంవత్సరాలు దాటిన యువతీ యువకులకు బాక్సింగ్ ఉషు రన్నింగ్ వాలీబాల్ షాట్ పుట్ పోటీలను ఎన్టీఆర్ స్టేడియం నర్సీపట్నంలో ఉదయం 6 గంటల నుండి నిర్వహిస్తున్నరన్నారు. కార్యక్రమం నైవైకే స్పోర్ట్స్ అథారిటీ అనకాపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు.

కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

విశాలాంధ్ర-యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక వెటర్నరీ హాస్పిటల్లో చేపట్టడం జరిగిందని అన్నారు. వెటర్నరీ డాక్టర్ పర్యవేక్షణలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను నిర్వహిస్తున్నామని తెలిపారు. యానిమల్ బర్త్ కంట్రోల్ - 2023 ప్రకారం కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రామాలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-మాకవరపాలెం : మాకవరపాలెం మండల కేంద్రంలోని కింది వీధిలోఉన్న రామాలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా ధనుర్మాసంలో రామాలయంలో కుంకుమ పూజలు జరుపుతారు. ఈ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిషోర్ పంతులుగారు కేతవరపు రత్నమాల , పలువురు భక్తులు, సభ్యులు, పాల్గొన్నారు.

స్వయం భూ గణపతి దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో లక్ష్మి గణపతి హోమం

విశాలాంధ్ర-చోడవరం: రాష్ట్రంలోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం స్వయం భూ కార్య సిద్ది గణపతి దేవస్థానంలో పుష్య శుద్ధ చవితి సందర్భంగా శుక్రవారం భక్తులు, మహిళలు, పుర ప్రముఖులు విద్యార్థులు చే సామూహికంగా లక్ష్మి గణపతి హెూమం నిర్వహించారు. పుష్యమాసం శరత్ రుతువులు సందర్భంగా వేకువ జామునే భక్తులచే మహా గణపతికి పురుష సూక్త విధానంలో పంచామృత అభిషేకములు, గణపతి అధర్వణ శీర్షం తో ప్రత్యేక పూజలు, అనంతరం సామూహిక లక్ష్మి గణపతి హెూమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పట్టణ వేద పండితులు ధవళ ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఆలయ చైర్మన్ ఉప్పల సతీష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పసుమర్తి సాంభశివరావు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే వేసవికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

గ్రామీణ నీటి సరఫరా అధికారులతో స్పీకర్ సమావేశం

విశాలాంధ్ర-నర్సీపట్నం: రాబోయే వేసవిలో త్రాగునీరు ఎద్దడి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలని స్పీకర్ అయన్నా పాత్రుడు రూరల్ వాటర్ సప్లై డి ఈ ఈ, ఏ ఈ అధికారులతో శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో పైప్‌లైన్లు, బోరు మోటార్లు సజావుగా పని చేయాలని, ఎక్కడైనా మరమ్మత్తుల అవసరం ఉంటే వాటిని వెంటనే పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా, నీటి ఎద్దడి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాబోయే వేసవిలో ప్రతి గ్రామానికి త్రాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డి ఈ ఈ శ్రీ ఎమ్. జయరామ్, మండల ఏఈ లు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో రోడ్డు అంచులు

- ట్రాఫిక్ వలయంలో వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

పరవాడలో రోడ్డుకిరువైపులా ఆటోలు నిలిపేయడంతో మధ్యలో ఇరుక్కున్న బస్సు

విశాలాంధ్ర-పరవాడ; కాస్త జాగా కనిపిస్తే చాలు.. అది రహదారి మార్జినా, నడకదారా? అన్నది కూడా పట్టించు కోవడం లేదు. పాగా వేసేస్తున్నారు. ముఖ్యంగా రహదారులను ఆనుకుని వ్యాపారాలు చేసేవారు తమ దుకాణాలను మార్జిన్లు, నడకదారులపైకి విస్తరిస్తున్నారు. రద్దీలేని ప్రాంతాలు కాబోలు అనుకుంటే పొరపాటే.. జాతీయ, ప్రధాన రహ దారుల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో పరవాడలో ప్రధాన రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్డు అంచుల ఆక్రమణలతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే వీలు లేక వాహనదారులు నిత్యం ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నారు. స్టబ్ స్టేషన్ కూడలి నుంచి సినిమా హాల్ కూడలి, పరవాడ సంతబయలు, మండల పరిషత్ కార్యాలయం కూడలి వరకు నిత్యం ట్రాఫిక్ సమస్యలే. ఈ మార్గాల్లో దుకాణ యజమానులు, కొనుగోలు దారులు రోడ్లపైనే తమ వాహనాలు నిలిపేస్తున్నారు. దీనికి తోడు వ్యాపారాలకు సంబంధించిన ప్రచార బోర్డులను కూడా రోడ్ల మార్జిన్లలోనే ఇష్టానుసారంగా పెడుతున్నారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. వాహన చోదకులు ఇబ్బందులతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకుని నడకదారులు, మార్జిన్లలో ఎలాంటి ఆక్రమణలు లేకుండా చాడాల్సి ఉంది. దీంతో ట్రాపిక్ సమస్య తీరుతుంది. పాదచారులు, ద్విచక్రవాహనదారులు సునాయసంగా రాకపోకలు సాగించడానికి వీలవుతోంది. ఈ నేపధ్యంలో అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లలో నెలకొన్న ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గొలుసు పారుతోంది!

- జోరుగా మద్యం విక్రయాలు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

విశాలాంధ్ర-పరవాడ ' గొలుసు దుకాణాలు ఎక్కడా ఉండకూడదు. వాటికి మద్యం సరఫరా చేసినా.. ఎక్కువ దరలకు అమ్మినా తొలిసారి లైసెన్స్ దారులకు రూ. 5 లక్షలు జరిమానా విధించాలి. రెండోసారి పట్టుబడితే ఏకంగా రద్దు చేయాలి. అన్ని దుకాణాల్లో సీసీ కెమెరాలు అమర్చాలి. ఫిర్యాదులకు టోల్ నంబరు ఏర్పాటు చేయాలి. దుకాణంలో ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలి' ఇదీ ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశిస్తూ మాట్లాడిన మాటలు.

అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పరవాడ మండల పరిధిలో పంచాయితీ, నగర పంచాయితీలతో కలిపి మొత్తం 13 మద్యం దుకాణాలు ఉండగా గ్రామాల్లో మాత్రం ఎక్కడ చూసిన గొలుసు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పల్లెల్లో గొలుసు దుకాణాల ద్వారా మద్యం పేరులై పారుతోంది. మద్యం దుకాణదారులకు ప్రభుత్వం పెట్టిన నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదు. లాబార్జనే ధ్యేయంగా విచ్చల విడిగా నిబంధనలు అతిక్రమిస్తూ బరి తెగిస్తున్నారు. సిండికేట్ అయిన మద్యం దుకాణదారులు గొలుసు దుకాణాలకు యదేచ్ఛగా తరలిస్తున్నారు. ఒక్కో క్వార్టర్ ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.20 వసూలు చేస్తూ సరఫరా చేస్తున్నారు. మద్యం దుకాణాల నిర్వహణలో పలుచోట్ల పర్మిట్ రూమ్లు, గొలుసు దుకాణాలు నడుపుతున్నా.. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అబ్కారీ శాఖ అధికారులు మద్యం దుకాణదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం దుకాణాల నిర్వహణ మొత్తం సిండికేట్‌గా మారి వ్యాపారులు అనధికార గొలుసు దుకాణాలకు తలుపులు తెరిచారు. మరో పక్క పలు మద్యం దుకాణాల్లో మద్యం కల్తీ అవుతోందన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. మరి ఇది ఇలాగే కొనసాగుతుందా లేక ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వీటికి అడ్డుకట్ట వేస్తుందా అనేది వేచి చూడాలి.